
సాక్షి
కాకినాడ

ఆదివారం | 9 | మార్చి | 2025



వెంబడించిన ఎక్సైజ్ పోలీసులు

ఎక్సైజ్ పోలీసులు వెంబడిస్తున్నారన్న భయంతో ఓ యువకుడు వేగంగా బైక్ నడిపి, లారీని ఢీకొని మృతి చెందిన ఘటన తాళ్లరేవు మండలంలో ఉద్రిక్తతకు దారి తీసింది.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహర్ సోమవారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.55
కాకినాడ	6.20	4.54
అమలాపురం	6.20	4.54

న్యూస్‌రీల్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మహిళలకు మెగా చెక్ అందిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

కాకినాడ సిటీ: ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదగాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, మెప్మా శాఖల సంయుక్త ఆధ్వర్యాన రాజా ట్యాంక్ ప్రాంగణంలో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని తమ ప్రభుత్వం త్వరలోనే కల్పిస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మే నెలలో చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున వారి తల్లుల ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. డీఆర్‌డీఏ ద్వారా ఈ ఏడాది బ్యాంకు లింకేజీ కార్యక్రమం కింద 588 మహిళా స్వయం సహాయ బృందాలకు రూ.100 కోట్లు అందించామన్నారు. దీనికి సంబంధించిన మెగా చెక్‌ను అందజేశారు. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ మిషన్ ద్వారా 78 వేల మంది మహిళలకు రూ.39 లక్షల మేర లబ్ధి చేకూర్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎస్పీ జి.బిందుమాధవ్, నగరపాలక సంస్థ కమిషనర్ భావన తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యాన కాకినాడ ఒకటో డివిజన్ వినాయక కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టైలరింగ్‌పై మహిళలకు మూడు నెలల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మెషీన్లు అందిస్తామన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 3,789 మందికి రూ.9.47 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల బాలాజీకి రూ.3.36 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తొలి హారతితో దర్శనాలు ప్రారంభమయ్యాయి. వివిధ సేవల ద్వారా రూ.3,36,594 ఆదాయం వచ్చింది. స్వామి వారిని ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మూడు వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

దే..వుడా..!

- సత్యదేవుని సన్నిధిలోనూ కూటమి దాష్టీకం
- 12 మంది శానిటరీ సూపర్‌వైజర్లను తొలగించాలని నేతల ఒత్తిడి
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులంటూ ముద్ర
- తమవారిని నియమించాలని హుకుం
- ఇప్పటికే ఇద్దరి తొలగింపు
- వారి స్థానంలో టీడీపీ నేతల అనుయాయుల నియామకం



అన్నవరం: ఎటువంటి రాగద్వేషాలూ లేకుండా ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానంటూ దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే.. ఆ ప్రమాణాన్ని ఉల్లంఘించి మరీ.. 'వైఎస్సార్ సీపీ వారికి ఏ పనులూ చేయవద్దు. ఏ ఉపకారమూ చేయవద్దు' అని ఇటీవల స్వయంగా సెలవిచ్చిన విషయం తెలిసిందే. ఆ మాటలను దిగువ స్థాయి నాయకులు ఆచరణలో పెడుతున్నారు. భక్తవరదుడైన సత్యదేవుని సన్నిధిలో జరుగుతున్న పరిణామాలే దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

ఏం జరిగిందంటే..

అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య పనులను ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారా నిర్వహిస్తున్నారు. వివిధ సత్రాలు, ఆలయ పరిసరాలు, ప్రాకారం, ఘాట్ రోడ్లు, టాయిలెట్స్ నిర్వహణ వంటి వివిధ పనులను సుమారు 349 మంది కార్మికులు నిర్వహిస్తుంటారు. వీరి పనిని పర్యవేక్షించేందుకు గాను ఆ కాంట్రాక్టర్ 12 మంది సూపర్‌వైజర్లను నియమించారు. 2014–19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రత్నగిరిపై శానిటేషన్ పనులను తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్ సంస్థ నిర్వహించేది. అప్పుడు కూడా ఈ 12 మంది సూపర్‌వైజర్లూ పని చేశారు. ఆ తరువాత 2019–24 మధ్య హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ ఈ పనుల కాంట్రాక్ట్ దక్కించుకోగా.. అప్పుడు కూడా ఇదే సూపర్‌వైజర్లు పని చేశారు. ఈ సంస్థ కాంట్రాక్ట్ కాలపరిమితి గత ఏడాది నవంబర్‌లో ముగిసింది. తిరిగి టెండర్లు పిలిచేంత వరకూ పనులు కొనసాగించాలని దేవస్థానం అధికారులు కోరడంతో ఆ సంస్థ మూడు నెలలు అధికంగా అంటే.. గత నెలాఖరు వరకూ ఈ పనులు నిర్వహించింది. ఈ మూడు నెలల్లో శానిటేషన్ పనులను కాంట్రాక్ట్‌కు అప్పగించేందుకు టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని అన్ని దేవస్థానాలకూ కలిపి ఒకే టెండర్ పిలవాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ పని చేయలేదు. అప్పటి వరకూ తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని అన్నవరం దేవస్థానం అధికారులను దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశించారు. దేవస్థానంలోని గోశాల తదితర విభాగాలకు కార్మికులను సమకూర్చే కాంట్రాక్ట్‌ను గుంటూరులోని కనకదుర్గా ఏజెన్సీస్ నిర్వహిస్తోంది. నెల రోజుల పాటు 349 మంది పారిశుధ్య సిబ్బందిని ఆ సంస్థ ద్వారా సరఫరా చేయడానికి దేవస్థానం అధికారులు కమిషనర్ అనుమతి కోరారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడం, ఎటువంటి టెండర్ పిలవకుండా ఇలా ఆ ఏజెన్సీకి పనులు అప్పగించడంపై వివాదం ఏర్పడింది. ఇదిలా ఉండగా, గతంలో కేఎల్‌టీఎస్ సంస్థ వద్ద పని చేసిన 349 మంది కనకదుర్గ ఏజెన్సీస్ వద్ద కూడా పని చేస్తున్నారు. వీరి పనులను గతంలో పని చేసిన 12 మంది సూపర్‌వైజర్లే పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు వారిని తొలగించి, తమ వారిని సూపర్‌వైజర్లుగా నియమించాలని అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నారు.



అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ఎడా పెడా..

అన్నవరం దేవస్థానంలో మూడు వంతులు ప్రత్తిపాడు నియోజకవర్గంలో, ఒక వంతు తుని నియోజకవర్గంలోకి వస్తుంది. అయితే, దేవస్థానంపై ప్రత్తిపాడు కన్నా తుని నియోజకవర్గ ప్రజాప్రతినిధుల పెత్తనమే ప్రస్తుతం ఎక్కువగా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. వారిని చూసి ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా తమపై ఒత్తిళ్లు తెస్తున్నారని అధికారులు వాపోతున్నారు. 12 మంది సూపర్‌వైజర్ల వ్యవహారంలో కూడా ఇదే జరుగుతోందని అంటున్నారు. ఈ ఒత్తిళ్లతో ఇప్పటికే ఇద్దరు సూపర్‌వైజర్లను తొలగించగా.. తుని, ప్రత్తిపాడు ప్రజాప్రతినిధులు తమ అనుయాయులను ఒక్కొక్కరిని నియమించుకున్నారు. 14 సంవత్సరాలుగా పని చేస్తున్నా.. తమను ఇన్నాళ్లూ ఎవ్వరూ తొలగించలేదని, ఇప్పుడు తొలగించాలనడం దారుణమని సూపర్‌వైజర్లు ఆవేదన చెందుతున్నారు. శానిటరీ సూపర్‌వైజర్లను తొలగించాలంటూ ఒత్తిళ్లు వస్తున్న మాట వాస్తవమేనని, గత నెలలో ఇద్దరిని తొలగించి, వారి స్థానంలో ఇద్దరిని నియమించారని, ఇంకెవ్వరినీ తొలగించలేదని అధికారులు అంటున్నారు. తాము ఈఓ ఆదేశాల ప్రకారం వ్యవహరిస్తామని, శానిటరీ సూపర్‌వైజర్ల పనితీరుపై ఎటువంటి ఫిర్యాదులూ లేవని చెబుతున్నారు.

యువతకు అండగా పోరుబాట

- 12న కాకినాడలో వైఎస్సార్ సీపీ ఆందోళన
- కన్నబాబు నివాసంలో కో–ఆర్డినేటర్ల సమావేశం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అధ్యక్షతన కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు కన్నబాబు, రాజా తదితరులు

కాకినాడ రూరల్: నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం, వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం తదితర కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ యువతకు అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టనుంది. 'యువత పోరు' పేరిట ఈ ఆందోళనకు సంబంధించిన కార్యాచరణపై పార్టీ నేతలు శనివారం కాకినాడలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు నివాసంలో శనివారం సమావేశమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అధ్యక్షతన జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ కాకినాడ సిటీ కార్యాలయంలో ఈ 12వ తేదీ ఉదయం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించిన అనంతరం, యువత పోరు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పార్టీ కాకినాడ సిటీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకోవాలని నిర్ణయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం చెల్లించి, విద్యార్థుల్లో ఆందోళన తగ్గించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కన్నబాబు, దాడిశెట్టి రాజా మీడియాకు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12న యువత పోరు పేరిట పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించనున్నామని చెప్పారు. ఏరుదాటాక తెప్ప తగలేస్తున్న చందంగా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరును ఎండగట్టనున్నామన్నారు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగుపరచి అమలు చేశారని, నేడు ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్ ఇస్తాయో, ఇవ్వవో, పరీక్షలకు కూర్చోనిస్తారో లేదో తెలియని పరిస్థితి సృష్టించారని దుయ్యబట్టారు. విద్యార్థులపై కళాశాలలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, ఈ విషయాలు టీడీపీ అనుకూల మీడియాలో ఎక్కడా రావని దుయ్యబట్టారు. ఒత్తిడి ఉంటే విద్యార్థులు ఏవిధంగా పరీక్షలు రాయగలుగుతారని వారు ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని, లేకుంటే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పటి వరకూ ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని నిలదీశారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ వంటి వాటికీ అతీగతీ లేదన్నారు. గత సీఎం జగన్ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు తీసుకురావడం చరిత్రాత్మకమన్నారు. వీటన్నింటినీ ప్రైవేటు పరం చేస్తామంటూ అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా చెబుతోందని దుయ్యబట్టారు. వైద్య కళాశాలలకు అనుబంధంగా పెద్ద ఎత్తున ఆస్పత్రులు వస్తాయని, తద్వారా ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తారనేది ప్రజల నమ్మకమని, చంద్రబాబు చెప్పింది చేయరనే విషయాన్ని ఆయన పాలన చెబుతోందని కన్నబాబు, రాజా విమర్శించారు. సమావేశంలో కాకినాడ సిటీ, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వంగా గీత, దవులూరి దొరబాబు, తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ గుబ్బల తులసీరామ్, పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు కురసాల సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, కొప్పన శివ, సుంకర విద్యాసాగర్, కాకినాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్ రామదేవు చిన్నా, పెదపాటి అమ్మాజీ, మురళీరాజు, వాసిరెడ్డి జమీలు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి.. భక్తజనసిరి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుడిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి, పూజలు చేశారు. రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు తమ బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. వీరందరూ స్వామివారి వ్రతాలాచరించి, దర్శనాలు చేసుకున్నారు. దీంతో ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారిని 40 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 1,800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 4 వేల మంది స్వీకరించారు. ఆలయంలో సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. సెలవు కావడంతో ఆదివారం కూడా రత్నగిరిపై భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆదివారం ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఊరేగించనున్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి



కేక్ కట్ చేస్తున్న వంగా గీత తదితరులు. చిత్రంలో దాడిశెట్టి రాజా, కన్నబాబు, నరసింహం, ద్వారంపూడి తదితరులు

- జగన్ ప్రభుత్వంలోనే వారికి సంపూర్ణ గౌరవం
- వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీ వంగా గీత
- కాకినాడలో ఘనంగా మహిళా దినోత్సవం

కాకినాడ రూరల్: మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ మహిళా నేత, పిఠాపురం నియోజవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎంపీ వంగా గీత అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మహిళలకు సంపూర్ణ గౌరవం దక్కిందని గుర్తు చేశారు. కాకినాడ వైద్య నగర్‌లోని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు నివాసం వద్ద పార్టీ మహిళా నేత వంగా గీత, మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గీత కేక్ కట్ చేసి పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, కన్నబాబు, కాకినాడ సిటీ, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం కో ఆర్డినేటర్లు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు, దవులూరి దొరబాబులతో పాటు మహిళా నేతలకు తినిపించారు. జై జగన్ అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినదించారు. వారికి కన్నబాబు, దాడిశెట్టి రాజా తదితరులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ, అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుండాలని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని నమ్మి, వారి అభివృద్ధిని చేతల్లో చూపిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పిల్లల చదువు కోసం అమ్మ ఎక్కడా చేయి చాచకూడదనే సమున్నత లక్ష్యంతో అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టారన్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చారని, మహిళల రక్షణకు దిశా చట్టం తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించారని చెప్పారు. మహిళలకు 31 లక్షల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్నారు. ప్రజల కోసం పోరాటం చేసే జగన్ కోసం ముందుకు నడుస్తామని అన్నారు. వర్ధినీడి సుజాత మాట్లాడుతూ, ఇప్పటి ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మహిళల పేరిట జగన్ సంక్షేమ పథకాలు ఇచ్చారని చెప్పారు. పార్టీ బలోపేతానికి మహిళలు కృషి చేయాలని కోరారు. కన్నబాబు మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించారని అన్నారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా రూ.1,500, ఉచిత బస్సు అంటూ చంద్రబాబు అబద్ధాలు చెప్పారన్నారు. మాట ఇస్తే నిలబెట్టుకునే జగన్‌మోహన్‌రెడ్డి వెనుక ఉండటం మనందరి అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు పెదపాటి అమ్మాజీ, జమ్మలమడక నాగమణి, సుంకర శివప్రసన్న, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, లక్ష్మీశివకుమారి, కవికొండల సరోజ, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ప్లేట్‌లెట్లు తగ్గిపోయిన గర్భిణికి ప్రసవం



తల్లీబిడ్డలతో ఆస్పత్రి వైద్యులు

అమలాపురం టౌన్‌: మనిషి శరీరంలో రక్త కణాలు (ప్లేట్‌లెట్లు) లక్షల్లోంచి వేలల్లోకి పడిపోతే మనం కంగారు పడతాం. అలాంటిది ఓ గర్భిణికి ప్లేట్‌లెట్లు 15 వేలకు పడపోవడమే కాకుండా మధుమేహం కూడా తోడవడంతో ఆమె ప్రసవం కష్టమైంది. ఈ తరుణంలో వైద్యులు రిస్క్‌తో శస్త్ర చికిత్స చేశారు. ఇప్పుడు తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి నెలల నిండడంతో ప్రసవం కోసం అమలాపురంలోని సాయి రవీంద్ర హాస్పిటల్‌లో చేరింది. చేరే సమయానికే ఆమె ఇమ్యూన్‌ థ్రోంబోసైటోపెనియా (ఐటీపీ) ప్లేట్‌లెట్లు 15 వేలకు పడిపోయి మధుమేహంతో బాధపడుతోంది. హాస్పిటల్‌ గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ గంధం భవానీ ..ఆమె ప్రసవం ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఫిజిషియన్‌ డాక్టర్‌ శ్రీహరి, మత్తు వైద్యుడు సందీప్‌, పిల్లల డాక్టర్‌ యోగానంద్‌, ఆర్థోపెడిక్‌ రవీంద్రలతో కూడిన వైద్య బృందం శస్త్ర చికత్స చేసి ప్రసవం చేశారు. ఇప్పుడు తల్లీ బిడ్డ ఆరోగ్యంగా కోలుకుంటున్నారని డాక్టర్‌ భవాని తెలిపారు.

ప్రాజెక్ట్‌.. పర్‌ఫెక్ట్‌

- ఇన్‌స్పైర్‌ మనక్‌లో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- ఉత్తమ ప్రాజెక్టులుగా 305 ఎంపిక
- ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేల కేటాయింపు
- మెరుగులు దిద్దుకునేందుకు అవకాశం



డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

రాయవరం: వినూత్న ఆలోచనలతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు సైన్స్‌ ప్రయోగాల్లో దూసుకుపోతున్నారు. సరికొత్త ఆలోచనలతో తమ మెదళ్లకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తున్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై అభిరుచి, ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు బోధన చేస్తుంటే, దానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్‌ మనక్‌ పురస్కారాలతో విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరంలో మనక్‌ నామినేషన్లకు అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 3,200 నామినేషన్లు రిజిస్ట్రేషన్‌ అయ్యాయి. వాటిలో ఉత్తమ ప్రాజెక్టులుగా 305 నామినేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో కోనసీమ జిల్లా నుంచి 85, తూర్పుగోదావరి జిల్లా నుంచి 100, కాకినాడ జిల్లా నుంచి 120 నుంచి ఉన్నాయి.

ప్రాజెక్టులకు ప్రోత్సాహకం : డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, నేషనల్‌ ఇన్నోవేషన్‌ ఫెడరేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌స్పైర్‌ మనక్‌ 2024–25 పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 305 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. గతేడాది 397 ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ఎంపిక కాగా, ఉమ్మడి జిల్లా నుంచి 27 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గమనార్హం. జాతీయ స్థాయికి మూడు జిల్లాల నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఇదిలా ఉంటే జిల్లా స్థాయికి ఎంపికైన 305 ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 వేల వంతున ప్రతి ప్రాజెక్టుకు ప్రోత్సాహకం అందజేయనున్నారు. సైన్స్‌ సాంకేతిక రంగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కేంద్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను వీటిలో భాగస్వాములను చేశారు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు వంతున నామినేషన్లను పంపించారు. పర్యావరణ పరిరక్షణ, అధునాతన వ్యవసాయ విధానాలు, హెల్త్‌ న్యూట్రిషన్‌ వంటి అంశాలపై నూతన ఆవిష్కరణలు రూపొందించారు.



తూర్పుగోదావరి జిల్లా నుంచి గతేడాది జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

త్వరలో జిల్లా స్థాయి ప్రదర్శన

ఇన్‌స్పైర్‌ మనక్‌ 2021–22కు సంబంధించిన జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన ఆన్‌లైన్‌లో నిర్వహించారు. 2022–23కు సంబంధించి జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల ప్రదర్శన ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను జిల్లాల వారీగా ఆయా జిల్లా కేంద్రాల్లో ప్రదర్శన ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే పది పరీక్షల అనంతరం ఈ ప్రదర్శన ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశముంది. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేయాల్సి ఉంది. ఎంపికైన ప్రాజెక్టుల్లో 10 శాతం ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 8 శాతం ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. గతేడాది మూడు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కాగా, ఈ ఏడాది కూడా జాతీయ స్థాయికి అధికంగా ప్రాజెక్టులు ఎంపిక అవుతాయన్న ఆశాభావాన్ని విద్యాశాఖ అధికారులు, ఉమ్మడి జిల్లా సైన్స్‌ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

గర్వకారణం



ఇన్‌స్పైర్‌ మనాక్‌కు జిల్లా స్థాయిలో ఎంపిక కావడాన్ని విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు గర్వకారణంగా భావించాలి. ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో మెరిసే విధంగా ఈ ప్రాజెక్టును మరింతగా తీర్చిదిద్దాలి. త్వరలో ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు, ఉపాధ్యాయులతో జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌ నిర్వహిస్తాం.

– జీవీఎస్‌ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్‌ అధికారి, అమలాపురం

జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి



జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రతి ప్రాజెక్టు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యే విధంగా ప్రాజెక్టులను మరింతగా అభివృద్ధి పర్చాలి. ఈ విషయంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాలి. ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థుల స్పందన అమోఘం. ప్రాజెక్టులను మరింతగా అభివృద్ధి పర్చుకునేందుకు చెయ్యేరులోని శ్రీనివాస ఇంజనీరింగ్‌ కళాశాల, రామచంద్రపురంలోని వీఎస్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాల సహకారం తీసుకుంటున్నాం.

– డాక్టర్‌ షేక్‌ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

పొలాలను వదిలి.. రోడ్డుపై బైఠాయించి..

- సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలు
- జాతీయ రహదారి 216పై రాస్తారోకో
- అధికారుల హామీతో ఆందోళన విరమణ





హైవేపై ఆందోళన చేస్తున్న రైతులు, భారీగా నిలిచిన ట్రాఫిక్‌, (అంతరచిత్రం) ఇరిగేషన్‌ ఈఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తాళ్లరేవు: సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కారు. జాతీయ రహదారి 216పై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని శివారు భూములకు కొన్ని రోజులుగా సాగునీరు అందక వరి చేలు ఎండిపోతుండడంతో శనివారం రైతులు పోలేకుర్రు ఇరిగేషన్‌ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే కార్యాలయంలో ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెంతనే ఉన్న జాతీయ రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. దీంతో ట్రాఫిక్‌ భారీగా నిలిచిపోయింది.

ఆందోళకారులతో చర్చలు

విషయం తెలుసుకున్న కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. రైతులు తమ సమస్యలను ఎస్సైతో పాటు రెవెన్యూ అధికారులకూ మొరపెట్టుకున్నారు. పి.మల్లవరం పంచాయతీ శివారు మూలపాలెం, గ్రాంటు, రాంజీనగర్‌ గ్రామాలకు 20 రోజులుగా సాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి చేలు పొట్టదశలో ఉన్నాయని, ఈ సమయంలో సరిపడా నీరు లేకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. వంతుల వారీ విధానం పెట్టినప్పటి నుంచి సాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఎగువ రైతులకు మేలు జరుగుతుందని, తమ వంతు వచ్చేసరికి కాలువ చివరికే నీరు రావడం లేదన్నారు.

తూతూమంత్రంగా..

అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు ఈ సమస్యను విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు వాపోయారు. అధికారులు తూతూ మంత్రంగా వచ్చి వెళుతున్నారని, అయితే సాగునీరు మాత్రం వరిచేలోకి రావడం లేదన్నారు. సాగు ప్రారంభంలో అధికారులను సంప్రదిస్తే ప్రతి ఎకరాకు నీరిస్తామని చెప్పారని అయితే ప్రస్తుతం నీరు అందక సుమారు 600 ఎకరాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. కాగా.. ఇరిగేషన్‌ అధికారులతో మాట్లాడి పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తామని అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

తక్షణమే సరఫరా చేయాలి

సాగునీరు లేక ఎండిపోతున్న శివారు ప్రాంత భూములకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలో పర్యటిస్తున్న ఆయన రైతుల ఆందోళన విషయం తెలుసుకుని అక్కడకు వచ్చారు. రైతుల సమస్యలు తెలుసుకుని ధవళేశ్వరం సర్కిల్‌ ఇరిగేషన్‌ ఈఈ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే చూడలేక రైతులు రోడ్డు మీదకు వచ్చారననారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సాగునీటి సమస్య వచ్చిందన్నారు. దీన్ని అత్యవసర పరిస్థితిగా భావించి అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన కదిలి, ప్రత్యేక అధికారిని వేయడంతో పాటు, ఎత్తిపోతల ద్వారానైనా ప్రతి ఎకరాకు సాగునీరందించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం ప్రతినిధులు మోర్త రాజశేఖర్‌, వల్లు రాజబాబు, టి.ఈశ్వరరావు, రైతులు మేడిశెట్టి శ్రీనివాసరావు, పితాని సత్తిబాబు, కె.వెంకన్నబాబు రాజు, కాదా సాయిబాబు, కావూరి వెంకన్న, పేరాబత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.18.34 కోట్ల నష్టపరిహారం పంపిణీ



బాధితులకు నష్ట పరిహారం నమూనా చెక్కును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లా పరిధిలో 42 బెంచ్‌లలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌లో రూ.18,33,80,798 నష్ట పరిహారాన్ని బాధితులకు అందజేశారు. రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ లోక్‌ అదాలత్‌ ద్వారా ఇరు పార్టీలకు డబ్బు, సమయం వృథా కాకుండా చూడడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఉమ్మడి జిల్లాలో రాత్రి 9 గంటల వరకూ 5,297 క్రిమినల్‌, 474 సివిల్‌, 147 ప్రీ లిటిగేషన్‌ కేసులు పరిష్కరించామన్నారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎన్‌.శ్రీలక్ష్మి మాట్లాడుతూ కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, కోర్టులు పనిచేస్తాయన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్‌)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,000
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

Education

DISTANCE EDUCATION

■ ఓపెన్‌ టెన్త్‌, ఇంటర్‌ వన్‌ సిట్టింగ్‌, డిగ్రీ, పీజీ, సైన్స్‌ & ఆర్ట్స్‌, MBA, MCA అన్ని యూనివర్శిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్‌ గైడెన్స్‌. మా ఆఫీసులు: కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్‌: 98495 82043, 99494 82757 [V- 2764]

Real Estate

■ రాజమండ్రి మల్లయపేట దుర్గానగర్‌ లో 161 చదరపు గజాలలో గల (G+1 Building East facing building అమ్మకము కలదు. నో మీడి యేటర్స్‌, సంప్ర: 9440342587 [C-820374]

PLOT FOR SALE

■ కేవలం 7.5లక్షలకే 25 సెంట్లు భూమి 100 ఎర్రచందనం మొక్కలతో కలిపి స్పాట్‌ రిజిస్ట్రేషన్‌ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎర్రచందనం సాగు ఒక్కటే మార్గం. © 98668 68887 [B-1266847]

■ రాజమండ్రి రూరల్‌ కడియపుసావరం గ్రామ ఇళ్ళ మధ్య ఈస్ట్‌ ఫేసింగ్‌ 154 చ॥గ॥ & జగ్గంపేట మండలం కాట్రేవులపల్లిలో 200 గ॥ స్థలం అమ్మబడును. © : 89851 27289 [SCA-25001953]

FLAT FOR SALE

■ కాకినాడ, రామారావుపేట, సుబ్బయ్య హోటల్‌ దగ్గర, SRIRAM Heights Apartments లో, East Facing 2 BHK Flat Brand New, 1065 Sft, అమ్మకమునకు కలదు. © : 90141 12583 [R-955]

HOUSE FOR SALE

■ RJY దివాన్‌ చెరువు సమీపంలో సింగిల్‌ B/R ఇండివిడ్యువల్‌ బిల్డింగ్స్‌ అమ్మకం. కేవలం 6,50,000/– & 8,50,000 లోన్‌ సౌకర్యం. ©: 70756 99344, 90002 54522 [R-7370]

BUILDING FOR SALE

■ RJY నారాయణపురం, బూరుగు చెట్టు దగ్గరలో 250 చ॥గ॥ల 3 BHK (G+1) ఇండివిడ్యువల్‌ న్యూ బిల్డింగ్‌ (South Facing) అమ్మకమునకు కలదు. Ready to occupy. © : 97005 44119 [R-953]

LEASE / RENT

■ COMMERCIAL SPACE for Lease/Rent at main road - Dowleswaram Lift & parking available 900 sft. each Floor 1st & 2nd Floor available Contact : ©:94743 52118, 63049 03886 [SCA-25001938]

Services

AC REPAIR

■ A/c గ్యాస్‌ రీఫిల్లింగ్‌ మరియు రిపేరింగ్‌ చేయబడును. మీకు A/c గ్యాస్‌ రీఫిల్లింగ్‌ & రిపేర్‌ చేయాలన్న సంప్ర. © : 94903 59067 [SCA-25002057]

BUSINESS OFFER



■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్‌ శానిటరీ ప్యాడ్‌, బేబి డైపర్‌ మెషిన్‌, ప్లాస్టిగ్‌ ఉద్యోగ్‌ స్థాపించండి, బైబ్యాక్‌ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011–25920179 [DA-6239]

Wanted

■ మెకానిక్‌ హెల్పర్లు కావలెను. జీతము 15000/– నుండి 18,000/– వరకు, శ్రీదేవి హోండా అథరైజ్డ్‌ డీలర్‌ : హోండా టూ వీలర్స్‌, టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ వద్ద మెయిన్‌ రోడ్‌, కాకినాడ © : 94909 98888 [R-131]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, దోస్త్‌ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ © 90300 44622 [B-1266928]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పనిచేయుటకు నర్సులు, కేర్‌ టేకర్లు, ఆడ/ మగ/ జంట కావలెను. ఫోన్‌: 9347556162/ 8309615249 [DA-56921]

■ సాయిరాం హోమ్‌ కేర్‌: Hydలో బేబి &పేషెంట్‌ కేర్‌ ముసలి వారిని చూసుకొనుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంటపనికి (ఆడ/మగ) కావలెను. 18 వేలు. 9949094607, 9908454607. [SCA25001954]

■ ఒమేగా హోంకేర్‌ నందు వృద్ధులను పేషేంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీ:20k ఫోన్‌: 8977639663, 8977639662 [HA-1903]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్‌ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999 [HA-37]

■ జీతం: రూ.15,000/– నుండి రూ.25,000/–, సర్వీస్‌ అడ్వైజర్‌ & ఇన్‌చార్జ్‌ కావలెను. కంప్యూటర్‌ నాలెడ్జ్‌ తప్పనిసరి. శ్రీదేవి హోండా, అథరైజ్డ్‌ డీలర్‌ : హోండా టూ వీలర్స్‌, టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ దగ్గర, మెయిన్‌ రోడ్‌, కాకినాడ © : 94909 98888 [R-128]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్‌

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

రీజనల్‌ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205

కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 99516 02838

తుని, జగ్గంపేట, యానాం : 90109 67896

అమలాపురం, ముమ్మిడివరం : 97053 47414

పి.గన్నవరం : 97057 49718, రాజోలు : 97053 45456

మండపేట : 99516 02941

రామచంద్రపురం : సెల్‌ : 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్‌, రాజానగరం. ఫోన్స్‌: 0883-2483010

హెల్త్‌ సిటీలో రక్త రుగ్మతల కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్‌ మామ్మెన్‌ చాందీ

ఆరిలోవ (విశాఖపట్నం): మహాత్మా గాంధీ క్యాన్సర్‌ ఆస్పత్రి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని హెల్త్‌ సిటీ యునిక్‌ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్త రుగ్మతుల కేంద్రాన్ని హెమటాలజీ పితామహుడు డాక్టర్‌ మామ్మెన్‌ చాందీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సికిల్‌ సెల్‌, తలసేమియాతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా విశాఖపట్నంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ క్యాన్సర్‌ ఆస్పత్రి మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ మురళీకృష్ణను అభినందించారు. నిమ్స్‌ మెడికల్‌ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్‌ సదాశివుడు మాట్లాడుతూ విశాఖలో రక్త రుగ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందడుగు పడిందన్నారు. మేనేజింగ్‌ డైరెక్టర్‌ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఎక్కడా రక్త వ్యాధులను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా హెమటాలజీ కేంద్రం లేదన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికి ఇక్కడ సమగ్ర రక్త రుగ్మతల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వెంబడించిన ఎక్సైజ్‌ పోలీసులు

- బైక్‌ పై వేగంగా వెళుతూ లారీని ఢీకొన్న యువకులు
- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన కోట శ్రీరామ్‌ (ఫైల్‌)



ఘటనా స్థలంలో బైక్‌, లారీ

తాళ్లరేవు: యానాం – ద్రాక్షారామ రహదారిలోని ఇంజరం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం గురజానాపల్లి శివారు అడివిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్‌ (21), పిఠాపురానికి చెందిన మరో యువకుడు పెద్దాపురంలోని ఒక కళాశాలలో చదువుతున్నారు. వీరు కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం వచ్చి తిరిగి వెళుతుండగా మద్యం తరలిస్తున్నారనే అనుమానంతో సుంకరపాలెం ఎక్సైజ్‌ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆపారు. అయితే వీరు బైక్‌ ఆపకుండా వెళ్లిపోవడంతో ఎక్సైజ్‌ పోలీసులు వెంబడించారు. దీంతో వేగంగా బైక్‌ నడుపుతూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కోట శ్రీరామ్‌కు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటీన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో యువకుడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎక్సైజ్‌ చెక్‌ పోస్టు ముట్టడి

యువకుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఎక్సైజ్‌ చెక్‌పోస్టు వద్దకు చేరుకుని ముట్టడించారు. ఎక్సైజ్‌ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నిండుప్రాణం బలై పోయిందని సిబ్బందిని నిలదీశారు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని ఒక ప్రైవేటు వ్యక్తిని మద్యం దుకాణాల వద్ద నిఘా పెట్టి.. అతడు ఇచ్చిన సమాచారంతో ప్రతి రోజూ ఇదే మాదిరిగా వేధిస్తున్నారన్నారని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సుంకరపాలెం చెక్‌పోస్టు వద్ద పరిస్థితిని సమీక్షించారు.

తీవ్ర ఉద్రిక్తత

సుంకరపాలెం పరిసర గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు ఎక్సైజ్‌ చెక్‌పోస్టును ముట్టడించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోట శ్రీకాంత్‌ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. వారితో కాకినాడ రూరల్‌ సీఐ చైతన్య కృష్ణ, ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ ఏనుగుల చైతన్య మురళి, అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరెంటెండెంట్‌ మౌనిక, ఎక్సైజ్‌ సీఐ స్వామి చర్చిస్తున్నారు. ఇంద్రపాలెం, గొల్లపాలెం, తిమ్మాపురం ఎస్సైలు వీరబాబు, మోహన్‌కుమార్‌, రవీంద్ర శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

వాడపల్లి వెంకన్నకు భక్తుల తాకిడి

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. గౌతమీ గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించారు. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వివాహితపై కత్తితో దాడి

ముమ్మిడివరం: ఓ వివాహితపై పక్కంటి వ్యక్తి కత్తితో దాడి తీవ్రంగా గాయపర్చాడు. అనాతవరం శివారు ఎదురుమూడి పుంతలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఆ గ్రామంలో పంతగంటి జయరామకృష్ణ, అతడి పక్కింటిలో 23 ఏళ్ల చాట్ల మాలతి నివాసం ఉంటున్నారు. మాలతి ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల పిల్లలు అల్లరి చేస్తుండగా మందలించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న జయ రామకృష్ణ కోపంతో కత్తి తీసుకుని మాలతిపై దాడి చేశాడు. దీంతో అపస్మారక స్థితికి చేరిన మాలతిని అమలాపురం కిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం సీఐ ఎం .మోహన్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఎస్సై డి.జ్వాలా సాగర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ మృతదేహం ఎవరిదో..

- ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు
- రాగి కడియం, మొలతాడే కీలక ఆధారాలు
- ఆరు రోజులైనా దొరకని ఆచూకీ



సంఘటనా స్థలంలో ఆధారాల కోసం గాలిస్తున్న పోలీసులు (ఫైల్‌)

పిఠాపురం: మృతుడి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వారికి దొరికిన రాగి కడియం, మొలతాడే కీలక ఆధారాలుగా మారాయి. హత్య జరిగిందని నిర్ధారించినా అసలు హతుడు ఎవరో తెలియక దర్యాప్తు ముందుకు కదలడం లేదు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలు 216 జాతీయ రహదారి పక్కన ఈ నెల 3వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్పీ బిందు మాధవ్‌ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఆ కేసు దర్యాప్తు చేస్తున్నారు. అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలలోను మిస్సింగ్‌ కేసులను వెతుకుతున్నారు. హతుడి వద్ద లభించిన రాగి కడియం, మొలతాడు ఆధారంగా ఆచూకీ తెలుసుకోవడానికి పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు మృతుడి ఫోటోలు పంపారు. ఘటనా స్థలం సమీపంలోని ప్రాంతాలలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అయితే ఆరు రోజులు గడుస్తున్నా ఎటువంటి చిన్న ఆధారం ఆచూకీ దొరకలేదు.